# అనగనగా... ఒక కథ

## పండుగాడి కథ

"సార్...శంకరం బావున్నాడా?" రత్నారెడ్డిగారిని అడిగాడు మూర్తి.

'మళ్లీ శంకరం ఎవర్రా బాబూ' అనుకుంది మిసెస్ లక్ష్మీమూర్తి.

హైదరాబాద్ రాక రాక వచ్చాడు మిస్టర్ మూర్తి.

అమెరికాలో కంప్యూటర్ గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేస్తున్న మూర్తి అదే కంపెనీలో వున్న లక్ష్మిని పెళ్లాడాడు. ఇరవై ఏళ్ల కాపురం అరమరికల్లేకుండా సాగిపోయింది. మధ్య మధ్యలో బొంబాయిలో ఉన్న వాళ్ల తల్లితండ్రీ కోసం ఆమె వచ్చేది. అతని తల్లికోసం తను హైదరాబాద్ వచ్చేవాడు ఆదరాబాదరా వెళ్లిపోయేవాడు.

ఇన్నాళ్లు పోయాక ఇద్దరూ కల్సి వచ్చారు. బొంబాయిలో అత్తమామలకి కొన్నాళ్ళు మొహం చూపించాక "హైదరాబాద్ వెళ్దాం" అని మొహం వాచినట్లు అడిగాడు. "పోనీ నే వెళ్తా- నువ్ నాల్గురోజులు పోయాకరా" అని రిక్వెస్ట్ చేశాడు. లక్ష్మి మాటే గెల్చింది. పదిరోజులు పోయాక లక్ష్మీమూర్తి భర్తతో కూడా హైదరాబాద్ వచ్చింది! తను తిరిగిన గల్లీల్లోనూ పెరిగిన ప్రదేశాల్లోనూ అద్దెకార్లో తిప్పుతున్నాడు మూర్తి.

"మేం ఇక్కడే ఈ రైల్వేట్రాక్ పక్కన మూడవ సందులో వుండేవాళ్లం. అదిగో ఆ మునిసిపల్ గ్రౌండ్ లోనూ వెల్‌ఫేర్ సెంటర్ గ్రౌండ్‌లోనూ మేము ఆటలాడుకునేవాళ్లం. ఇక్కడ గణపతిగాడు నన్ను కొట్టాడు" లక్ష జ్ఞాపకాలు తవ్వి రాసి పోస్తున్నాడు మూర్తి. కారుదూరని సందుల్లోకి డ్రైవర్‌కి రైటూ లెఫ్టూ చెప్తూ ఈ గొందిలోకి తీసుకొచ్చాడు మూర్తి! తన చిన్నతనం ఈ అద్దె ఇంట్లోనే గడిచిందిట! ఇంటి ఓనరు రత్నారెడ్డిగారు పాతికేళ్లు గడచినా చెక్కు చెదరకుండా ఉన్నాడుట! 'నువ్ బాగా మారిపోయావ్' అని ఆయనా 'మీరేం మారలేదని' ఈయనా ఒకళ్లనొకళ్లు కౌగలించుకున్నంతపని చేసి పులకించిపోయారు. మిసెస్ మూర్తికి చిరాగ్గా వుంది కానీ తప్పదు. మొగుడు పాతికేళ్ల జ్ఞాపకాల్ని తవ్వుకుని తన్మయుడు అవుతున్నాడు. పాత మట్టి తలమీద పోసుకుని థ్రిల్ అయిపోతున్నాడు. వాళ్లు అద్దెకున్నప్పటి వాటా చూశాడు. 150 రూపాయలు అద్దె అప్పుడు. ఇప్పుడు 4000 దాకా వస్తోందిట!

రత్నారెడ్డీ, భర్తా ఫ్లాష్‌బేక్కుల్లో బురిడీలు కొట్టారు.

"సార్! శంకరం బావున్నాడా" అని భర్త అడగ్గానే 'మళ్లీ ఆ మహానుభావుడు ఎవర్రా బాబూ' అనుకుంది మిసెస్ లక్ష్మి. ఈ ఏరియాలో ఎంటరైనప్పణ్నుంచి మునిసిపాల్టీ ఎద్దులా ఇంచుమించు ప్రతీ గల్లీముందూ కారాపి కథలు చెప్తున్నాడు. మా డ్రీమ్‌గర్ల్ అన్నపూర్ణ ఈ గల్లీలోనే వుండేది. రవిగాడి ఇల్లు ఈ పక్కనే. మల్లాదిగాడు ఈ చివ్వరే. ఇలా కారు డ్రైవరుకి కూడా వినుపొచ్చీలా..కథ స్లోగా సాగుతోంది.

"శంకరమా? బావున్నాడోయ్..వయసు మీద పడిందిగా..ఎక్కువ శ్రమపడలేకపోతున్నాడు. తక్కువ పని చేసినా శ్రమపడిపోతున్నాడు" అన్నాడు రత్నారెడ్డిగారు.

'అవును శంకరాన్ని చూసి పాతికేళ్లు దాటుతోంది. అసలే బక్కపల్చగా ఉండే అతనికీపాటికి అరవై అయిదేళ్లు వచ్చివుంటాయి' అనుకున్నాడు మూర్తి.

చాలాసేపు చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. వాళ్లు ఇచ్చిన కాఫీకి-ఆప్యాయతకీ పులకించిపోయాడు మూర్తి. కార్లోంచి కానుకల పెట్టిలోంచి వాక్‌మెన్ తీసుకొచ్చి ఆయనకి గిఫ్ట్ ఇచ్చాడు. రత్నారెడ్డిగారు ఎంతో పులకించిపోయాడు.

అక్కణ్ణుంచి వాళ్ల కారు సన్నటి గల్లీలో తిరగలేక వెనక్కి నడిచి మరోగొంది (సందు) కోసం కొంచెం పెద్దరోడ్డు ఎక్కింది.

ఎంతసేపు అని..ఇలా వెనక్కి వచ్చినంతసేపట్లో "లెఫ్ట్ తీసుకో" అని ఆర్డరేశాడు మూర్తి.

లక్ష్మి వినుక్కోవడం మానేయడమే మంచిదని నిర్ణయానికి వస్తోంది.

ఆ లెఫ్ట్‌గల్లీ మరింత ఇరుగ్గావుంది. కారు దూరటానికి కావల్సినంత జాగాలేదు.

"సార్..లోపలికి చాలాదూరం వెళ్లాలా" అన్నాడు డ్రైవర్.

'శబ్బాష్' అనుకుంది లక్ష్మి మనసులో- తన మనసులో మాటని డ్రైవర్ అనేశాడు. పోన్లే వెళ్లిపోదాం అంటాడేమోనని మొగుడికేసి ప్రశ్నార్థకంగా చూసింది.

"అబ్బే..అట్టేదూరం లేదయ్యా- ఆ తాడిచెట్టు..కనిపిస్తూంది కదా...అది"

"అక్కడికి వెళ్లచ్చుగానీ సార్..రివర్స్ తీసుకోటం ప్రాబ్లమే" అన్నాడు డ్రైవర్.

ఇరుకు సందుల్లో..మురికి గొందుల్లో..శ్రీవారికి హితులో పరిచితులో సన్నిహితులో స్నేహితులో ఉండటం లక్ష్మికి కొంతంత చిరాగ్గానూ ఇంకొంత విడ్డూరంగానూ అనిపించింది. కానీ నోరు విప్పలేదు. మనస్సుతో గొంతుని అదిమిపెట్టింది. "పోనీ కారు ఇక్కడే ఉంచి నడుద్దాం" అని కరణేషు మంత్రిలా సలహా ఇచ్చింది ధర్మపత్ని.

"యూ ఆర్ కరెక్ట్" అంటూ డోర్ తీసి కిందకి దిగాడు మూర్తి. అనుసరించింది సహధర్మచారిణి.

తాడిచెట్టు ఇక్కడే ఉన్నానని ఎత్తుగా కనిపిస్తోంది గానీ ఓ క్వార్టర్ కిలోమీటరు పైనే ఉంటుంది అనే విషయం లక్ష్మికి తెల్సింది- అందుకే డ్రైవర్ నిర్మొహమాటంగా వెనక్కు తిరిగి రాలేమని ముందు చూపుతో చెప్పేశాడు-లెఫ్ట్ రైట్..నడక మొదలెట్టారు దంపతులు.

"శంకరం ఇంటికి వెళ్తున్నాం. నీకెప్పుడూ చెప్పలేదు కదూ..అతను నాకు ఎల్కేజీ నుంచి సెవెంత్ క్లాసు వరకూ తెల్సు. నేనంటే ఎంత 'ఇది'గా వుండేవాడో అతన్ని కల్సి వెళ్లాలని ఈ ట్రిప్పులో ప్రోగ్రాం ఫిక్స్ చేసుకున్నాను" నడకో పరుగో తెలీదుగానీ మూర్తి అడుగులు ఉత్సాహంగా పడుతున్నాయి. లక్ష్మి కొంత నెమ్మదిగా అనుసరించడం మూలాన్ని అతని వేగం తగ్గుతోన్నట్లు కనిపిస్తోంది.

శంకరం మీద ఉన్న ఇష్టం మూర్తి హృదయంలోంచి మాటగా అనువాదితమై వినిపిస్తోంది లక్ష్మికి.

★ ★ ★


ఎల్‌కేజీ కెళ్లే ఆరుగురు పిల్లల్లో మూర్తి ఒకడు. అందర్నీ ఎక్కించుకుని రిక్షాలో స్కూలుకి చేర్చి, స్కూలు అయిపోగానే ఇంటికి చేర్చేవాడు శంకరం.

అమ్మానాన్నా బలవంతంగా ఈ స్కూలు రిక్షా ఎక్కించి టాటా చెప్తూ లోపలికెళ్లిపోయాక భోరుమని ఏడిచేవారు పిల్లలు. మూర్తి (ఆరోజుల్లో ముద్దుపేరు పండు) మరీ ఏడ్చేవాడు- అప్పుడు శంకరం తన జేబులోంచి చాక్లెట్స్ తీసి పండుతోబాటు పిల్లలందరికీ ఇచ్చేవాడు.

ఒకసారి స్కూల్ వదిలాక ఇంటికి వెళ్లిపోదామనే ఆత్రంలో..రిక్షాకోసం వస్తూ..పరిగెడ్తూ..ధమేల్‌న పడ్డాడు పండు..మోచేతికి పెద్దదెబ్బే తగిలింది-'బేర్' మన్నాడు. చూస్తుండగానే చెయ్యి పూరిలా పొంగింది. ముట్టుకుంటే కెవ్వుమంటున్నాడు. పట్టుకుంటే గిలగిల్లాడుతున్నాడు.

చెయ్యి విరిగిందన్నారు కొందరు. ఎముక తప్పుకుందని అన్నారు కొందరు..ఏదేమైనా పండు గగ్గోలు పెడుతున్నాడు.

శంకరం మిగిలిన పిల్లలని ఇంకో రిక్షా కుదిర్చి..పండుని హాస్పిటల్‌కి తీసుకెళ్లాడు-ఎక్స్‌రే ఫోటో తీయాలన్నారు. సిమెంటు కట్టు వెయ్యాలన్నారు. నెల్లాళ్లు చెయ్యి కదలకుండా మెళ్లో వేల్లాడకడతామన్నారు. దాదాపు 45 రూపాయలు ఖర్చవుతుందని చెప్పారు. ఎక్స్‌రే ఫోటోకి 4 రూపాయలు కట్టి అదయ్యేలోగా అప్పోసొప్పో చేసి మిగిలిన డబ్బు తెచ్చి ఇచ్చాడు. కట్టు కట్టించాడు.



పండు ఇంకా రాలేదేమని కంగారుపడుతున్న తల్లికీ తండ్రికీ కంగార్లోంచి కన్నీళ్లు..కన్నీళ్లలోంచి శంకరం పట్ల కృతజ్ఞత జాల్వారాయి. ఆ తర్వాత పిల్లల్తో కూచోడం కష్టమని కుదుపుల్లో కుమ్ములాటల్లో నొప్పి పెరుగుతుందనీ మిగిలిన పిల్లలకి వేరే రిక్షాని కుదిర్చి, శంకరం..పండునొక్కణ్నే తీసుకెళ్లేవాడు. నిజానికి శంకరానికి అది చాలా నష్టం. కానీ అతనికి డబ్బుకన్నా ముఖ్యం ఏమిటో తెల్సు..అతని మంచితనం పండు తల్లికీ తండ్రికీ తెల్సు. పండుకి ఇంకా తెల్సు.

అందుకే...ఆనాటి రిక్షా శంకరాన్ని కలవడానికి వస్తున్నాడు ఇవ్వాళ విదేశాలంత ఎత్తుకెదిగిన మూర్తి.

శంకరం ఎక్కువ ఏమీ మారలేదు. పాతికేళ్ల వయస్సు మాత్రం పెరిగింది. అలాగే చొక్కా నిక్కరూ వేసుకున్నాడు. పాకలాంటి రేకుల రూఫ్ గదిలోనే వుంటున్నాడు. వీధికిటూ అటూ మొక్కల్లా వున్న చిన్న చిన్న ఇళ్లు మహా వృక్షాల్లా పెరిగిపోయాయి. వీధి స్వరూపమే మారిపోయింది.

శంకరం ఉంటున్న 60 గజాల గది తప్ప.

శంకరం మూర్తిని గుర్తుపట్టటానికి చాలా టైమే పట్టింది.

"ఎవురిల్లు కావాల్నా" అని అమాయకంగా అడిగాడు.

"మీ ఇల్లే" మూర్తి చిలిపిగా నవ్వుతూ.

"ఈ జాగ ఇమ్మని సేనామంది అడుగుతున్రులే నేనివ్వ"

"నేను గీ ఇల్లు కొన్నాకి రాలేదు" అంటూ నవ్వాడు మూర్తి.

"నన్ను యాదికి తెచ్చుకో" అన్నాడు మొహం ముందుకి పెట్టి.

అయోమయంగా చూస్తూ "నువ్ మా పండు గానివా ఏంది?" అన్నాడు.

అసంభవం! హైలీ ఇంపాజిబుల్! నన్ను మా చుట్టాలే పోల్చుకోలేదు..ఈ రిక్షా శంకరం పూర్తిగా మారిపోయిన నన్ను గుర్తుపట్టగలిగాడు. ఇరవై ఐదేళ్లలో మనిషిలో ఎంత మార్పు వుంటుంది? నేనే..నా చిన్నప్పటి ఫోటో చూసుకుని గుర్తుపట్టలేను. నా శరీరంలో అణువణువునీ తన ప్రతీ అణువుతో చూసే నా భార్య కూడా ఈ ఫోటోలు మీవి కాదని 'తేల్చేసింది.' మూర్తికి శంకరం జ్ఞాపకశక్తిమీద కాదు..తన మీదవున్న ప్రేమమీద..అపారమైన కృతజ్ఞతాభావం ఏర్పడింది.

ఇరవై అయిదేళ్లలో ఎంతమందిని తన రిక్షాలో చేరవేశాడో అందరూ గుర్తుంటారా అతనికి..మూర్తి కళ్లలో సన్నటి కన్నీటిపొర.

లక్ష్మివైపు చూశాడు.

లక్ష్మి శంకరంకేసి చూసి విస్తుపోయింది.

భర్త మొహంలో బ్రహ్మానందాన్ని గమనిస్తోంది.

చాలాసేపు ఆ ముచ్చటా..ఈ ముచ్చటా అయ్యాయి.

శంకరం ఆ భార్యాభర్తల్ని చూసి సాక్షాత్తూ లక్ష్మీ నారాయణులే వచ్చినట్లు థ్రిల్ అయిపోతున్నాడు.

కిరసనాయిలు స్టౌమీద సత్తుగిన్నెలో నీళ్లోసి టీ పొడెం పంచదార వేసి.."వొక్కచ్చణం కూసోన్రి" అని బైటకెళ్లబోయాడు.

పాలు తేవడానికి అని మూర్తికి తెల్సింది-

"మేం టీలో పాలు పోసుకోం డికాషన్ చాలు" అన్నాడు. లక్ష్మి డికాషన్ తాగినంత వెగటుగా మొహం పెట్టింది.

"నేను భీ..డికాచ్చన్నే తాగుతా.." అన్నాడు శంకరం.

పాల ఖర్చు ఎవాయిడ్ చేయడానికని మూర్తికి అర్థం అయింది.

"నీదీ ఫారెన్ స్టైల్లే" అన్నాడు మూర్తి.

టీ తాగటం పూర్తయాక "మాకు మీ రిక్షా ఎక్కాలని వుంది. గల్లీ మొదట్లో మా కారుంది. ఆడదాకా వొస్తావా" అన్నాడు మూర్తి. ఓ మురికి గుడ్డతో రిక్షా తుడిచి రడీ చేసాడు. లక్ష్మిమూర్తి రిక్షా ఎక్కారు.

ఇరుకిరుగ్గా కష్టపడి కూచున్నారు. మూర్తికెంత ఆనందమో బాల్యంలోకి వెళ్లిపోతున్నట్లు-లక్ష్మి అతని ఆనందాన్ని షేర్ చేసుకుంది. కారు ముందు రిక్షా ఆగింది. "కిరాయి ఇవ్వవా" అన్నాడు లక్ష్మితో.

లక్ష్మి బేగ్‌లోంచి కొన్ని ఐదువందల రూపాయలు తీసి మూర్తి చేతికిచ్చింది-ఇండియన్ కరెన్సీలో..ఆ డబ్బు శంకరానికిచ్చాడు! డబ్బులు తీసుకున్న శంకరం చేతులు వణికాయి..కళ్లు తొణికాయి.

*